రైతుల ర్యాలీని అడ్డుకోవడం అప్రజాస్వామికం

కూనంనేని సాంబశివరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్‌భవన్‌కు ర్యాలీగా బయలుదేరిన రైతులను పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామికమనీ, నియంతృత్వ పాలనకు ఇది నిదర్శనమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలనీ, వ్యవసాయ ధరలు నిర్ణయించే కమిటీలో రైతుల ప్రాతినిధ్యం ఉండాలనీ, విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలనీ, సన్న, చిన్న, మధ్యతరగతి రైతులకు రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలనీ, వ్యవసాయ రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా శనివారం తెలంగాణలో శాంతియుతంగా రాజ్‌భవన్‌కు ర్యాలీగా బయలుదేరిన రైతులను అడ్డుకోవడం తగదన్నారు. పేదలు, గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు కల్పించకుండా, 2022 అటవీ సంరక్షణ చట్టం పేరుతో గిరిజనులు అటవీ నుంచి వెళ్ళగొట్టి కార్పొరేట్ శక్తులకు భూములు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రైతాంగ సమస్యలు పరిష్కరించేంత వరకు రైతులు చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని కూనంనేని తెలిపారు.

భిక్షాటనతో పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాలుగు నెలలుగా వేతనాలు అందక అవస్థలు పడుతున్న పారిశుధ్య కార్మికులు శనివారం వినూత్నంగా నిరసన తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మేజర్ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షుడు రాజేశ్వర్ మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారులు కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, ప్రభుత్వం స్పందించి వేతనాలు చెల్లించి కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు దుబాక ఆశన్న, సముద్రాల నర్సయ్య, మచ్చ నారాయణ, నంది లక్ష్మణ్, సముద్రాల గంగమ్మ, జన్నారపు గంగమ్మ, దుబాక రామవ్వ పాల్గొన్నారు.

రాందేవ్ బాబాపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి : సునీతారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాందేవ్ బాబాపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సునీతారావు డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ వద్ద రాందేవ్ బాబా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా సునీతారావు మాట్లాడుతూ మహిళల గురించి ఇలా మాట్లాడం తగదన్నారు. ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గీతారెడ్డి, నాయకులు వరలక్ష్మి, ఉన్నారు.

నేటి నుంచి
తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభ

- సభాస్థలాన్ని పరిశీలించిన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు
- 30 వేల మందితో ఎన్‌జి కళాశాలలో బహిరంగ సభ

సభాస్థలిని పరిశీలిస్తున్న జూలకంటి, తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోరాటాల గడ్డ నల్లగొండ జిల్లా రైతు ఉద్యమ కార్యాచరణకు వేదికైంది. వ్యవసాయ జిల్లాగా పేరొందిన నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆదివారం నుంచి మూడ్రోజులపాటు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర 2వ మహాసభ జరగనుంది. ఈనెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జరుగుతున్న రైతు వేడుకకు అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు చేపట్టిన రైతు ఉద్యమాలపై సమీక్షించుకోవడంతోపాటు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యాచరణను మహాసభలో రూపొందించనున్నారు. రైతాంగ సమస్యలు తీవ్రమవుతున్న తరుణంలో ఈ మహాసభ ప్రాధాన్యత సంతరించుకుంది. పట్టణంలోని ఏచూరి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న మహాసభలో 800 మంది ప్రతినిధులు పాల్గొంటారు.

ఆదివారం జరిగే బహిరంగసభకు 30 వేలమంది రైతులు తరలిరానున్నారు. దీనికి జాతీయ స్థాయి నాయకులూ హాజరవుతున్నారు. మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ పది రోజులుగా నగరంలో సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలను రైతుసంఘం, మహాసభ ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో మహాసభకు సంబంధించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. బహిరంగసభ జరిగే ఎన్‌జీ కళాశాల మైదానం వద్ద, ప్రతినిధుల సభ జరిగే ఏచూరి గార్డెన్ ఫంక్షన్ హాల్‌ను స్వాగత తోరణాలతో సిద్ధం చేశారు.

మహాసభ కార్యక్రమ వివరాలు..

మహాసభ మొదటి రోజు 27న నాగార్జున డిగ్రీ కళాశాల మైదానంలో బహిరంగసభ జరగనుంది. మధ్యాహ్నం 2 గంటలకు నగరంలో రైతుప్రదర్శన ఉంటుంది. కలెక్టరేట్ ఎదురుగా ఎఫ్‌సీఐ రోడ్ నుంచి ప్రకాశంబజార్ మైసయ్య విగ్రహం పెద్దగడియారం మీదుగా ఎన్‌జీ కళాశాల మైదానానికి చేరనుంది. అనంతరం అక్కడ సభ ప్రారంభం కానుంది. మహాసభ జరిగే ప్రాంతాన్ని వీరనారి మల్లు స్వరాజ్యం నగరంగా నామకరణం చేశారు. మహాసభకు ఏఐకెఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ అశోక్ దావలె, ప్రధానకార్యదర్శి హన్నన్‌మొల్లా, జాతీయ సహాయ కార్యదర్శి విజ్జు కృష్ణన్, ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, ప్రధాన కార్యదర్శి టి.సాగర్, ఆహ్వానసంఘం అధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు నంద్యాల నర్సింహారెడ్డి హాజరవుతున్నారు.

28న ఉదయం నుంచి ప్రతినిధుల సభ ఏచూరి గార్డెన్ ఫంక్షన్‌హాలులో ప్రారంభం కానుంది. ఈ వేదికకు మాలి పురుషోత్తంరెడ్డి, గొర్ల ఇంద్రారెడ్డి ప్రాంగణంగా నామకరణం చేశారు. 29న 'వ్యవసాయ సమస్యలు- ఐక్యఉద్యమాలు - ఆవశ్యకత' అంశంపై సదస్సు జరగనుంది. ఇదే సమయంలో వామపక్ష రైతు సంఘాల సందేశాలు ఉంటాయి. మధ్యాహ్నం చర్చలు, వివిధ అంశాలపై తీర్మానాలు ఉండనున్నాయి. అనంతరం నూతన రాష్ట్ర కమిటీ ఎన్నికతో మహాసభ ముగుస్తుంది.

సభావేదికను పరిశీలించిన జూలకంటి

ఎన్‌జి కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించనున్న బహిరంగ సభ వేదిక, ఏచూరి గార్డెన్‌లో ప్రతినిధుల సభ ఏర్పాట్లను శనివారం ఆహ్వాన సంఘం అధ్యక్షులు, తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి పరిశీలించారు. ఆయన వెంట ఆహ్వాన సంఘం సభ్యులు రైతు సంఘం రాష్ట్ర నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, సయ్యద్‌హాషం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, ఎండి.సలీం, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ తదితరులు ఉన్నారు.

రాజ్‌భవన్ రోడ్డులో ప్రజాసంఘాల శాంతియుత నిరసన

- పలువురు నాయకుల అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా హైదరాబాద్‌లోని సోమాజిగూడలో రాజ్‌భవన్ రోడ్డులో శనివారం రైతు, గిరిజన, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహించారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. అనంతరం నాయకులను పోలీసులు అరెస్టు చేసి గోషామహల్, సైఫాబాద్, పంజాగుట్ట పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. తాము శాంతియుతంగా ప్రదర్శన చేస్తుంటే అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని, రైతు రుణ విముక్తి చట్టం చేయాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. రైతు ఉద్యమ సమయంలో 80 వేల మందిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, రైతు, వ్యవసాయ కార్మికులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లఖింపూర్ ఖేరి ఘటనలో ఐదుగురి హత్యకు కారకులైన కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రాను కఠినంగా శిక్షించాలని కోరారు. అలాగే, 16 నెలలకుపైగా సాగిన రైతు ఉద్యమం సందర్భంగా ప్రధానమంత్రి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు గుమ్మడి నరసయ్య, ఉజ్జిని యాదగిరిరావు, నాయకులు రాయల చంద్రశేఖర్ ప్రసాద్, పశ్యపద్మ, టి.సాగర్, వేములపల్లి వెంకట్రామయ్య, మట్టయ్య రమావత్, అంజయ్య నాయక్, బి.రాజు, లతా, స్వరూప, శ్రీరామ్, బాల మల్లేష్, పుస్తెల సృజన, సంధ్య, ఇందిరా, బిక్షపతి, భాగం హేమంతరావు, సుదర్శన్ రావు, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు, గిరిజన ప్రజాసంఘాల నాయకులు తదితరులున్నారు.

గాంధీలో 'టిఫా' స్కానింగ్ మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఫా స్కానింగ్‌తో గర్భంలో ఉన్న శిశువు ఆరోగ్య స్థితి తెలుసుకోవచ్చని పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన 2 టిఫా స్కానింగ్ మిషన్‌లను మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టిఫా స్కానింగ్ కోసం ప్రయివేటు ఆస్పత్రుల్లో రూ.3 వేల నుంచి 5 వేల రూపాయల వరకు వసూలు చేస్తారని, అదే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా నిర్వహిస్తామని చెప్పారు. రూ.20 కోట్లతో 56 టిఫా స్కానర్‌లను కొనుగోలు చేసి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఆస్పత్రుల్లో ప్రారంభించిట్టు వివరించారు. ఈ స్కానర్‌తో గర్భంలోని శిశువు అవయవాల ఎదుగుదలలో లోపాలు ఉంటే ముందే తీసుకుని జాగ్రత్తలు తీసుకొనే అవకాశం ఉంటుందన్నారు. వందల కోట్ల రూపాయలతో అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా ఆస్పత్రులను అభివృద్ధి చేశామని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఎంతో చరిత్ర కలిగిన గాంధీ ఆస్పత్రిలో కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా అనేక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ఆరోగ్య శాఖ మంత్రిగా హరీశ్‌రావు బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ ఆస్పత్రుల్లో అనేక నూతన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు వివరించారు. ఆస్పత్రులకు రోగుల వెంట వచ్చే సహాయకుల కోసం అతి తక్కువ ధరకు భోజనం అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు, కార్పొరేటర్ హేమలత, ఆర్ఎంఓ విజయకృష్ణ, శాంతి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారులకు పంపిణీ

- రూ.18 వేల కోట్ల వ్యయంతో 2.91 లక్షల ఇండ్ల నిర్మాణం
- రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖ కమిషనర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలకు రెండు పడకల ఇండ్ల నిర్మాణం పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో నిరుపేదలకు రెండు పడకల ఇండ్ల నిర్మాణాలు చేపట్టి ఉచితంగా ఇచ్చే కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్రంలో 2.91 లక్షల ఇండ్ల నిర్మాణం చేపట్టేందుకు రూ.18 వేల కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. మున్సిపాల్టీల్లో, గ్రామాల్లో ఇప్పటికే అన్ని ఇండ్ల నిర్మాణం పూర్తి దశకు చేరుకున్నాయి. వాటికి మౌలిక సదుపాయాలు రోడ్డు, విద్యుత్, మంచినీరు, డ్రైనేజీ వంటి సౌకర్యాలు పూర్తి చేసి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాల్సిన బాధ్యతను ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు అప్పగించింది. 2023 జనవరి 15 వ తేదీ లోపల ఏమైనా చిన్న చిన్న పనులు ఉంటే పూర్తి చేయించి మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులను ఎంపిక చేసి అప్పగించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉండాలనీ, దారిద్ర్య రేఖకు దిగువన ఉండి తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి అద్దె భవనాల్లో నివసిస్తున్న వారు అర్హులని స్పష్టం చేసింది. ముందుగా గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించాలనీ, వచ్చిన దరఖాస్తులను సంబంధిత తహశీల్దార్లకు పంపించాలనీ, క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితాను కలెక్టర్లకు పంపించాలని కోరింది. అనంతరం అట్టి జాబితాను కలెక్టర్ల ద్వారా ప్రభుత్వానికి పంపిస్తే క్షుణ్ణంగా పరిశీలించి తుది జాబితా పంపించడం జరుగుతుందని తెలిపింది. కట్టిన ఇండ్ల కంటే అర్హులైన లబ్ధిదారులు ఎక్కువ ఉంటే లక్కీ డీప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని మిగిలిన వారి జాబితాను వెయిటింగ్ లిస్ట్‌లో పెట్టాలని అధికారులు భావిస్తున్నారు. ఆయా జిల్లాల్లో లక్ష్యంగా పెట్టుకున్న రెండు పడకల ఇండ్ల నిర్మాణ పనుల్లో ఇప్పటికే టెండర్ పూర్తై నిర్మాణ దశలో ఉన్న వాటిని జనవరి 15లోగా పూర్తి చేసేందుకు ఒక నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్లను ఆదేశించింది.

గుత్తికొయ్యల గ్రామ బహిష్కరణ

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

అటవీశాఖ అధికారి శ్రీనివాసరావు హత్యను ఖండిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడు పంచాయతీ తీర్మానించింది. గుత్తికోయలందర్నీ గ్రామం నుంచి బహిష్కరించాలని గ్రామసభ నిర్ణయించింది. వారందర్నీ ఎర్రబోడు నుంచి ఛత్తీస్‌గఢ్‌కు తరలించాలని తీర్మానంలో పేర్కొంది. పోడు సాగుకు అడ్డొస్తున్నారని చంద్రుగొండ రేంజ్ అటవీ అధికారి (ఎఫ్‌ఆర్‌ఓ) చలమల శ్రీనివాసరావు(45)ను గొత్తికోయలు దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపింది.

రాష్ట్రస్థాయి ఉద్యోగులతో డోబ్రియాల్ సమీక్ష

ఎఫ్‌ఆర్‌ఓ శ్రీనివాసరావు హత్య నేపథ్యంలో రాష్ట్రస్థాయి అటవీ ఉద్యోగులతో అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్) డోబ్రియాల్ సమీక్ష నిర్వహించారు. అన్ని వర్గాల మద్దతుతో అడవిని కాపాడాలన్నారు. అటవీ రక్షణే ప్రథమ విధి అని, సిబ్బంది తమ విధుల్లో పాల్గొనాలని కోరారు.

రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

- సిఎల్‌పి నేత మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని సిఎల్‌పి నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాజ్యాంగం మూల సిద్ధాంతమే కాంగ్రెస్ సిద్ధాంతమన్నారు. రాజ్యాంగాన్ని అందించడంలో కృషి చేసిన కాంగ్రెస్ పట్ల నిబద్ధతతో ఉండాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బిజెపి, టిఆర్ఎస్ రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నాయని విమర్శించారు. ప్రధాని మోడీ రాజ్యాంగ విరుద్ధంగా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. దేశ ప్రజల భావప్రకటన స్వేచ్ఛను మోడీ సర్కార్ హరించి వేస్తున్నదని చెప్పారు. రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని బిజెపి చూస్తోందని విమర్శించారు. దేశంలో ఆర్థిక అసమానతలను బిజెపి పెంచి పోషిస్తోందనీ, ఒకరిద్దరు కార్పొరేట్లకే దేశ సంపదను దోచిపెడుతున్నదని విమర్శించారు. బిజెపి అరాచకాలను కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాజ్యాంగాన్ని మార్చాలన్న బిజెపి, టిఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. రాజ్యాంగాన్ని పరిరక్షిద్దామంటూ కాంగ్రెస్ శ్రేణులతో ఈ సందర్భంగా భట్టి ప్రమాణం చేయించారు.

మహిళా హక్కుల కోసం అంబేద్కర్ కృషి

- వాకిటి సునీతా లక్ష్మారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళల హక్కుల కోసం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎంతో కృషి చేశారని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాకిటి సునీతా లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ, సమన్యాయం అందించే ఉన్నత లక్ష్యాలతో రూపొందించిన రాజ్యాంగం గొప్పదన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో భారతరత్న అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగ పరిరక్షణ సవాలుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనదనీ, దేశాన్ని ఒకే తాటిపై నడిపించే స్ఫూర్తితో పనిచేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాజ్యాంగం ప్రకారం మహిళలకు సమానత్వం, గౌరవం వివక్ష నుండి స్వేచ్ఛ, వారి హక్కులను రక్షించే చట్టాలున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అనేక పథకాలను అమలు చేస్తున్నదన్నారు. మహిళలకు రక్షణగా షీటీమ్స్, భరోసా సెంటర్లు, మహిళా యూనివర్సిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. వివిధ సమస్యలతో కమిషన్ వద్దకు రాలేని వారికి సోషల్ మీడియా ద్వారా కూడా పిర్యాదు చేయవచ్చని గుర్తుచేసారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ SCWTelangana , ఇమెయిల్ ద్వారా, వాట్సప్ నంబర్ 9490555533 కూడా మహిళలకు జరిగే అన్యాయాన్ని కమిషన్ దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ కార్యదర్శి కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎంజెపి బిసి మహిళా వ్యవసాయ డిగ్రీ కాలేజీలో ప్రవేశాలు

డాక్టర్ మల్లయ్య బట్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మా జ్యోతిభాపూలే బిసి సంక్షేమ వ్యవసాయ మహిళా గురుకుల డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని మహాత్మా జ్యోతిభాపూలే బిసి సంక్షేమ గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి డాక్టర్ మల్లయ్య బట్టు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఎంసెట్, అగ్రిసెట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం మహిళా వ్యవసాయ డిగ్రీ కాలేజీలు వనపర్తి, కరీంనగర్‌లో ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు మహాత్మా జ్యోతిభాపూలే బిసి సంక్షేమ గురుకుల విద్యాసంస్థల వెబ్‌సైట్ http://mjptbcwreis.telangana.gov.inను సందర్శించాలని మల్లయ్య బట్టు సూచించారు.

హక్కులను హరిస్తే పాలకవర్గాలకు శంకరగిరి మాన్యాలే..

- జిపి కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి
- మోడీ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఢిల్లీ ముట్టడి
- సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు సాయిబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"కార్మికుల హక్కులను హరిస్తే పాలకవర్గాలకు శంకరగిరి మాన్యాలు తప్పవు.. ప్రజల ప్రాణాలను కాపాడుతున్న పంచాయతీ కార్మికులకు కనీస వేతన చట్టం ఎందుకు అమలు చేయడం లేదు? కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం అమలు చేయాలి.." అని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు సాయిబాబు డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాలుగో మహాసభ శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ మైదానంలో జరిగింది. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ.. 30 ఏండ్లుగా గ్రామపంచాయతీ పరిధిలో సేవలందిస్తున్న కార్మికులకు కనీస వేతనం ఎందుకు అమలు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వాలు, విధానాలు మారుతున్నా కార్మికుల జీవితాలు మాత్రం మారడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మురికిలో పనిచేస్తూ అనారోగ్యాలకు గురవుతున్న కార్మికులు బలమైన ఆహారం తీసుకోలేని దయనీయ స్థితిలో జీవనం సాగిస్తున్నారని చెప్పారు. కనీస వేతనం రూ.26 వేలు పెంచాలని దేశ ఉన్నత న్యాయస్థానం చెప్పిన తీర్పును ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. 24 గంటలు అత్యవసర సేవలు అందిస్తున్న ఆశాలు, అంగన్‌వాడీలు, గ్రామపంచాయతీ కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. భారత్ వెలిగిపోతుందన్న మోడీ.. ఆకలి దారిద్ర్యంలో మన దేశం ప్రపంచంలో 107వ స్థానంలో ఎందుకు నిలిచిందని ప్రశ్నించారు. దేశ ఆహార నిలువలను పందికొక్కులు కాజేస్తున్నా.. బడుగు బలహీన వర్గాలు, పేదలకు పంపిణీ చేయడం లేదన్నారు. దేశ సంపద 100 రూపాయల్లో 73 రూపాయలు ఒకరికి చెందితే. 27 రూపాయలు 99 మందికి వెళ్తున్నాయని చెప్పారు. శాశ్వత పనుల దగ్గర ఉద్యోగస్తులను సైతం శాశ్వత ఉద్యోగులుగా నియమించాలన్న నిబంధనలను తుంగలో తొక్కడం దారుణం అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును ఇప్పటికైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సూచించారు.

గ్రామపంచాయతీ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తానన్న కేసీఆర్ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట నిలబెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. మహాసభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గజపతి, ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు జయలక్ష్మి, అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కార్యదర్శి మల్లేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యరంగం ర్యాంకింగ్‌లో..
తెలంగాణ అగ్రస్థానం... ఉత్తర్‌ప్రదేశ్ చివరి స్థానం

- ట్రబుల్‌కు కారణమేంటో డబుల్ ఇంజిన్ సర్కార్ చెప్పాలి
- వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరోగ్య రంగానికి సంబంధించిన నీతిఆయోగ్ విడుదల చేసిన ర్యాంకింగ్‌లో తెలంగాణ అగ్రస్థానంలో ఉంటే, బిజెపి పాలిత ఉత్తర్‌ప్రదేశ్ చివరి స్థానంలో ఉందని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని పెట్లబురుజు ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి నుంచి వర్చువల్ పద్ధతిలో రాష్ట్రంలోని 44 ఆస్పత్రుల్లో 56 టిఫా స్కానింగ్ మిషన్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ ఇంజిన్ సర్కారంటూ గొప్పలు చెప్పుకుంటున్న బిజెపి నాయకులు ఉత్తర్‌ప్రదేశ్‌లో ఆరోగ్యరంగం ఎందుకు ట్రబుల్‌లో ఉందో చెప్పాలని సవాల్ చేశారు. పుట్టబోయే పిల్లల్లో లోపాలను గర్భంలో ఉండగానే గుర్తించేందుకు 'టిఫా' (టార్గెటెడ్ ఇమేజింగ్ ఫర్ ఫీటల్ అనామలీస్ స్కాన్) దోహదం చేస్తుందని తెలిపారు. "ప్రభుత్వ దవాఖానాల్లో ఇప్పటికే 155 అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్లు ఉన్నాయి. నెలకు సగటున 11 నుంచి 12 వేల పరీక్షలు జరుగుతున్నాయి. వీటిలో గుర్తించలేని లోపాలను టిఫా స్కాన్ వల్ల మాత్రమే ఇలాంటివి గుర్తించగలుగుతాం. వీటి కోసం రూ.20 కోట్లు వెచ్చించాం. దీని కోసం ఇప్పటికే రేడియాలజిస్టులు, గైనకాలజిస్టులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. ప్రయివేటులో టిఫా స్కాన్‌కు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక నుంచి ఈ ఆర్థిక భారం పేదలకు పూర్తిగా తప్పుతుంది. ప్రతి నెల సగటున 20 వేల మంది గర్భిణులు ఈ సేవలు ఉచితంగా వినియోగించుకునే వెసులుబాటు కలుగుతుంది. గర్భిణులకు18 నుంచి 22 వారాల మధ్య ఈ స్కాన్ చేయాల్సి ఉంటుంది. నిపుణులైన రేడియాలజిస్టులు లేదా గైనకాలజిస్టులు మాత్రమే ఈ స్కాన్ చేస్తారు. గర్భంలోని శిశువు తల నుంచి కాలిబొటన వేలు వరకు ప్రతి అవయవాన్ని ఇందులో భాగంగా స్కాన్ చేస్తారు. ఇందుకు కనీసం 20-30 నిమిషాలు పడుతుంది. గుండె, ఊపిరితిత్తులు వంటి అంతర్గత అవయవాలు, కంటి రెప్పలు, పెదవులు, వేళ్లు, చెవులు, కండ్లు, ముక్కు.. ఇలా ప్రతి అవయవాన్ని 3డి, 4డి ఇమేజింగ్ రూపంలో స్కాన్ చేస్తుంది. గ్రహణం మొర్రి, గుండెలో రంధ్రం, కాళ్లు, చేతులు వంకరగా ఉండటం, వెన్నుపూస వంటి అవయవాల్లో ఏవైనా లోపాలు తెలుస్తుంది. కొన్ని సందర్భాల్లో పిల్లలు పుట్టగానే సర్జరీ చేయాల్సి రావొచ్చు. ముందే గుర్తించగలిగితే డెలివరీ సమయంలో పీడియాట్రిక్ సర్జన్లను అందుబాటులో ఉంచి ప్రాణాలు రక్షించవచ్చు" అని హరీశ్ రావు తెలిపారు.

మాతాశిశు సంరక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ.. ప్రసవానికి ముందు, తర్వాత, ప్రసవ సమయంలో మూడంచెల్లో సేవలందిస్తున్నట్టు హరీశ్‌రావు తెలిపారు. ఇప్పటి వరకు 12 లక్షల 66 వేల మంది బాలింతలకు రూ.263 కోట్లు విలువ చేసే కెసిఆర్ కిట్లు, ఆర్థిక సాయం రూ.1,261 కోట్లుతో కలుపుకుని రూ.1,525 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. మాతా శిశు ఆరోగ్య సంరక్షణలో భాగంగా కొత్త ఆస్పత్రుల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన, తదితర అభివృద్ధి పనుల కోసం రూ.403 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. గాంధీ ఆస్పత్రిలో రూ.55 కోట్లతో 200 పడకల ఎంసీహెచ్ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. నిమ్స్‌లో రూ.55 కోట్లతో 200 పడకల ఎంసీహెచ్ మంజూరు చేసినట్టు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,900 సబ్ సెంటర్లను పల్లె దవాఖానలుగా మార్చుతున్నామనీ, దీంతో 3,800 గ్రామాల్లో డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, కుటుంబ ఆరోగ్య సంక్షేమ విభాగం కమిషనర్ శ్వేత మహంతి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ రమేష్ రెడ్డి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, పెట్ల బురుజు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాలతి, మెటర్నల్ హెల్త్ జెడి డాక్టర్ పద్మజ, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL-CUM - III ADDITIONAL DISTRICT JUDGE (FAMILY COURT) AT VIZIANAGARAM
M.O.P. 133/2021

Between:
Bondada Bangarayya ....Petitioner
And:
Amgothu Ravi and others .....Respondents

R-2 : Kunuguntla Narasimha Rao, S/o Venkaiah, aged 48 years, Hindu, Owner of the lorry bearing No. AP 16 TE 6728, Residing at Garikapadu Village, Jaggayyapeta Mandal, Kishna District, now residing at H. No. 4-67/3/2/A/2, Kodadoppogit Street, St. Joseph C C Reddy Convent, Near Samudik Bhavan, Ameenabad, Nalgonda

NOTICE

Please take notice that the above O.P., stands posted to **28-12-2022** for notice to the 2nd respondent. You should appear in person or through an advocate at **10-30 AM** on the above said date in the above court.

If you not appear on the said date the above matter will be decided exparte.

(P.A.N. Raju)
Advocate for the petitioner
Vizianagaram.

C.P.C. ఆర్డరు 5 రూలు 1 మరియు 5 ప్రకారము దావా సమను
కందుకూరు సీనియర్ సివిల్ జడ్జ్ గారి కోర్టులో
O.S.No.8 / 2018

తల్లపరెడ్డి బ్రహ్మా రెడ్డి ... వాది
Vs
తల్లపరెడ్డి సుబ్బమ్మ @ చిన సుబ్బమ్మ వగైరాలు ... ప్రతివాదులు

To, (D4) **శ్రీ తల్లపరెడ్డి నరసింహా రెడ్డి, తండ్రి బ్రహ్మా రెడ్డి,** నివాసము 1-4-19/1, సాయి ప్రియ కాలనీ, కాప్రా టౌన్ అండ్ మునిసిపాలిటీ, హైదరాబాద్ సిటీ, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రము.

అయ్యా,
పై నంబరున దావాలో 3వ ప్రతివాది అగు బొర్రా సుబ్బమ్మ @ మూలే సుబ్బమ్మ @ పెద సుబ్బమ్మ గారు నీ పేరటకు తేది: 21-07-2016న వ్రాయించి ఇచ్చిన రిజిష్టర్ సెటిల్మెంట్ పత్రమును రద్దు చేసి వాది తాలూకు హక్కును తీర్మాణము చేయమని పరిహారము కోరుచూ, వాది నీ వగైరాలపైన పై దావా దాఖలు చేసియున్నాడు. సదరు దావా మీకు నోటీసు నిమిత్తము తేది: 06-12-2022 న వాయిదా వేయబడి వున్నది. కాన సదరు వాయిదా రోజు ఉదయము 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై దావా విషయమై మీకు గల ఆక్షేపణలను మరియు మీ తాలూకు వాదన సరియగు Counter Claim మరియు దాని సంబంధిత రుజువు పత్రములు దాఖలు చేసుకొనవలసిందిగా ఆదేశించడమైనది. అట్లు తప్పి మీరు హాజరు కానియెడల పై దావా మీ పరోక్షమందు విమర్శ చేసి తీర్మానించబడును.

కె. రాజశేఖర రెడ్డి, బి.ఎ., ఎల్.ఎల్.బి.,
వాది ప్లీడర్, కందుకూరు.

బతికుండగానే వల్లకాడుకు..

- ఇంట్లోకి రానివ్వని ఇంటి యాజమాని
- తుదిశ్వాస విడిచాక అంత్యక్రియలు
- కలిచివేసిన ఓ నిరుపేదింటి దుస్థితి
- కరీంనగర్ జిల్లాలో మూఢాచార ఘటన

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

'ఎవరైనా చనిపోయినంక శ్మశానానికి తీసుకొస్తరు. కిడ్నీ ఫెయిల్ అయి చావుబతుకుల్లో ఉన్న మా నాన్నను ప్రాణం ఉన్నప్పుడే కాష్టానికి తీసుకొచ్చినం. ఓనరోల్లు రానియ్యకపోవడంతో ఏం చేయాల్నో అర్థం కాక.. ఎక్కడ ఉండాల్నో తెల్వక.. మిగిలింది ఈ చోటేనని శ్మశానికి వచ్చాం. కొన ఊపిరితో ఉన్న నాన్నను 24గంటలూ కాపలా కాస్తూ... కాలుతున్న కాష్టాల దగ్గర ముగ్గురు ఆడవాళ్లం గజగజ వణుకుతూ గడిపాం. నాన్న తుదిశ్వాస విడిచాక ఇక్కడే అంత్యక్రియలు చేసి కర్మకాండలు చేశాం. నాలుగేండ్ల కిందట గుండెపోటుతో అన్నయ్య చనిపోయినప్పుడూ ఇదే పరిస్థితి ఎదుర్కొన్నాం. అయితే, అప్పుడు అన్నయ్య మృతదేహాన్ని శ్మశానికి తెస్తే.. నాన్న బతికున్నప్పుడే వల్లకాడుకు తీసుకొచ్చాం. ఈ పరిస్థితి ఎవరికీ రావొద్దు' అంటూ కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన తల్లీకూతుళ్లు భారతి, స్వప్న, సరిత బోరున విలపించారు.

మరో ఘటనలో జిల్లా కేంద్రానికే చెందిన నేరెళ్ల మహేష్ ఆపరేషన్ వికటించి మరణిస్తే.. అల్గునూర్ చౌరస్తాలోనే శవాన్ని వేసుకుని అంత్యక్రియలు నిర్వహించింది ఆ కుటుంబం. చివరికి అదే వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో తలదాచుకుని కర్మకాండలు నిర్వహించుకుంది.

ఇలాంటి ఘటనలు ఏ ఒక్కరి సమస్యో కాదు.. పట్టణాల్లో అద్దెకుండే కుటుంబాలందరిదీ. బతికున్నంత వరకూ ఆప్యాయంగా కబుర్లు చెప్పే ఇండ్ల యజమానులు ప్రాణం పోయాక శవాలను దూరం పెడుతున్నారు. మూఢనమ్మకాల ప్రభావం వేళ్లూనుకున్న పట్టణాల్లో ఇలాంటి దురాచార సంస్కృతి మనుషుల్లో మంచితనం, మానవత్వాన్ని మంటగలుపుతోంది. సొంతిల్లు.. కనీసం సొంత జాగా లేని కుటుంబాల్లో నిత్యం ఇలాంటి హృదయవిదారక దృశ్యాలు కనిపిస్తున్నాయి. కరీంనగర్ జిల్లా కేంద్రం సహా కార్మికక్షేత్రాలైన రాజన్నసిరిసిల్ల, రామగుండంలాంటి ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగాయి. ఇతర ప్రాంతాల నుంచి చేనేత పని కోసం సిరిసిల్లకు వచ్చి అద్దె ఇండ్లలో స్థిరపడిన నేత కార్మిక కుటుంబాల్లో ఎవరైనా చనిపోతే చందాలు వేసుకుని దహన సంస్కారాలు నిర్వహిస్తున్న పరిస్థితి. ఇక్కడ సొంతిల్లు, జాగాలేని నేత కార్మిక కుటుంబాలే అద్దెఇండ్లలో సుమారు పది వేల వరకూ ఉన్నాయి.

చనిపోతే శవం బయటే..

కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, రామగుండంలాంటి ప్రధాన నగరాలు, పట్టణాల్లో సొంతిల్లు, జాగ లేని కుటుంబాలు సుమారు లక్షన్నరకుపైగానే ఉంటాయని ఓ అంచనా. ఇక పిల్లల చదువుల కోసమనో, వ్యాపారాల కోసమనో పల్లెల నుంచి పట్టణాలకు వచ్చి స్థిరపడిన వారూ ఆ సంఖ్యకు మించే ఉంటారు. ఈ పరిస్థితిలో అద్దెకుండే కుటుంబాల్లో ఎవరైనా అనారోగ్యంతో, రోడ్డు ప్రమాదాల్లో చనిపోతే ఇంటి యజమానులు శవాలను తీసుకరానివ్వడం లేదు. ప్రాణం ఎక్కడ పోయినా పలువురు ఇండ్ల యజమానులు మాత్రం అద్దెకుండే వారి శవాన్ని ఇంట్లోకి రానివ్వడం లేదు. బయటి వ్యక్తులు ఇంట్లో చనిపోతే అరిష్టమని, ఇల్లు మూసేయాల్సి వస్తుందన్న మూఢ నమ్మకాలను పెంచుకుంటున్నారు. బాగా చదువుకున్న వారు సైతం నాగరికతను మర్చిపోయి పాతతరం మనుషుల్లా ఆలోచిస్తున్నారు. మనిషి దూరమైన బాధతో కన్నీరు మున్నీరయ్యే కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడం మరిచి మృతదేహాలను బయటే ఉంచాలని నిర్దయగా చెప్పేస్తున్నారు.

వేళ్లూనుకుంటున్న మూఢాచారాలు

మత ఆచారాలు, కుల కట్టుబాట్లు.. మూఢనమ్మకాలు.. ఇలా ఏవైనా రానురానూ మనిషిలో మానవత్వాన్ని మంటగలుపుతున్నాయి. అదీ నాగరికత ఉన్న పట్టణాల్లోనే ఎక్కువగా కనిపిస్తోంది. అద్దెకుండే ఇంట్లో శుభకార్యాలు, విందులు, వినోదాలుంటే పాల్గొనే యజమాని.. అదే అద్దెకున్న మనిషి కన్నుమూస్తే మాత్రం అటు వైపుచూడటం లేదు సరికదా.. ఇంట్లోకి మృతదేహాన్ని తీసుకరానివ్వని వారు కొందరు ఉంటే.. వెంటనే ఇల్లు ఖాళీ చేయాలని చెప్పే ఘనులూ ఉన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు మనుషుల్లోనే మార్పురావాలి తప్ప.. చట్టాలు ఎన్ని ఉన్నా.. మార్పు సాధ్యంకాని పరిస్థితి నెలకొంది.

ఊరూరా శ్మశానవాటికలు, పట్టణాల్లో కర్మకాండ భవనాలు
వై.సునిల్‌రావు- కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్

గతంలో సొంతజాగ లేక, శ్మశానవాటికలు లేక చాలా మంది పేదలు ఇంట్లో ఎవరైనా చనిపోతే రోడ్డు మీదనో, చెరువుల్లోనో దహన సంస్కారాలు నిర్వహించుకునేవాళ్లు.. అలాంటి పరిస్థితికి పూర్తిగా చరమగీతం పాడిన తెలంగాణ రాష్ట్ర సర్కారు ఊరూరికీ శ్మశానవాటికలు నిర్మించింది. కర్మకాండలు నిర్వహించుకునేందుకు సొంతిల్లు లేని వారి కోసం ఈ ఐదేండ్లలో భవనాలూ నిర్మించింది. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో 12రోజుల కర్మకాండల కోసం సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఈ భవనాల సంఖ్య మరిన్ని పెంచుతాం.

జూబ్లీహిల్స్‌లో ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ రోడ్ నం. 45తో పాటు మరికొన్ని రోడ్లపై ఉన్న ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు పోలీసులు కసరత్తు మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే చేపట్టిన ట్రాఫిక్ మళ్లింపును నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. జూబ్లీహిల్స్ రోడ్ నం. 54లోని హార్ట్‌కప్ చౌరస్తా, వరమహాలక్ష్మి చౌరస్తా, రోడ్ నం. 36లోని క్రోమా చౌరస్తాలో ట్రాఫిక్ సాగుతున్న తీరును ఆయన స్వయంగా పరిశీలించారు. ట్రాఫిక్ మళ్లింపుతో ఎక్కడెక్కడ ఇబ్బందులు వస్తున్నాయి.. ప్రజల నుంచి వస్తున్న స్పందనపై పంజాగుట్ట ట్రాఫిక్ ఏసిపి జ్ఞానేందర్‌రెడ్డి, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్‌తో చర్చించారు. ట్రాఫిక్ మళ్లింపుతో అంతర్గత రోడ్లపై కూడా దృష్టిసారించాలని, ఈ విధానం అలవాటు అయ్యేంత వరకు వాహనదారులకు నచ్చజెప్పాలని సూచించారు.

నేడు టిఆర్ఎస్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

సిఎం ఆదేశాల మేరకు ఆదివారం తెలంగాణ భవన్‌లో హైదరాబాద్ జిల్లా పార్టీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నగర మేయర్, డిప్యూటీ మేయర్, పార్లమెంట్, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ మాజీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరు కావాలన్నారు.

భూసేకరణకు రైతులు సహకరించాలి

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

భూసేకరణకు రైతులు సహకరించి అభివృద్ధికి పాటుపడాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జె.చుక్కారావు దేవాదుల మూడోదశ పనుల నేపథ్యంలో శనివారం జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని బిఖ్యా నాయక్ పెద్దతండాలో మల్లంపల్లి, బిఖ్య నాయక్ పెద్ద తండా, హటియ తండా, కొండాపురం, వావిలాల గ్రామాల రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సాగునీరు అందించేందుకు సిఎం కెసిఆర్ కృతనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. భూ సేకరణకు రైతులు సహకరించాలని సూచించారు. కొంతమంది రైతులకు నష్టం జరిగినా వందలాది మందికి సాగునీటితో మేలు జరుగుతుందని చెప్పారు. భూములు కోల్పోతున్న రైతులు ఎకరాకు రూ.12 లక్షలు డిమాండ్ చేయడం సరైందే అయినప్పటికీ.. 9 లక్షలు ఇచ్చేందుకు సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. భూ సేకరణ చేపట్టి కాలువ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, స్టేషన్ ఘనపురం, తొర్రూర్ ఆర్డీవోలు కృష్ణవేణి, లొల్లేవార్ రమేష్, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

టివి వ్యాఖ్యాతలకు భాషపై పట్టు ఉండాలి

- కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల

ప్రజాశక్తి – కల్చరల్

వివిధ తెలుగు చానెళ్లలో వ్యాఖ్యతలకు భాషపై పట్టుతోపాటు ఉచ్ఛరణలో దోషాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర పూర్వ సమాచార, పౌరసంబంధాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి సూచించారు. శ్రీత్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై జివిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ నిర్వహణలో టివి చానెళ్ల యాంకర్లకు పురస్కరాల ప్రధానోత్సవం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ వేణుగోపాలాచారి పాల్గొని మాట్లాడుతూ వ్యాఖ్యానం విభిన్న కళ అని వివరించారు. సౌజన్య దాత చిల్ల రాజశేఖరరెడ్డి అధ్యక్షత వహించిన సభలో దక్షిణ మధ్య రైల్వే విశ్రాంత జనరల్ మేనేజర్ రామకృష్ణ, బొప్పాన నరసింహరావు, కుసుమ భోగరాజు తదితరులు పాల్గొనగా వెంకటరెడ్డి, రామరాజు, శ్రీనివాసరావులు స్వాగతం పలికారు. పురస్కారాలు అందుకున్న వారిలో ఎబిఎన్ విజయ చంద్రిక, దూరదర్శన్ చంద్ర, హెచ్‌ఎమ్ కల్పన రాధ, సి.వి.ఆర్ మాధురి, టి.వి 5 కవిత, మహా న్యూస్ దీపిక, 10 టివి షేక్ వలి, వనిత టివి రేచల్, స్టూడియో–ఎన్ వెంకట్ తదితరులు ఉన్నారు.

నల్లగొండలో త్వరలో శిల్పారామం

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ పట్టణంలోని పానగల్ వద్ద శిల్పారామం ఏర్పాటుకానుంది. సుమారు ఐదు ఎకరాల స్థలంలో రూ.10కోట్లతో ఈ శిల్పారామం నిర్మించనున్నారు. శిల్పారామం భవన నిర్మాణ డిజైన్లు పూర్తయ్యాయి. శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్‌రావు బృందం సోమవారం లేదా మంగళవారాల్లో ఈ స్థలాన్ని పరిశీలించనున్నారు. హైదరాబాద్‌లో నాగోల్ వద్ద ఉన్న శిల్పారామం తరహాలో నల్లగొండలో నిర్మించనున్నారు. పర్యాటక కేంద్రాల అభివృద్ధిలో భాగంగా ఇక్కడ ఉన్న ఛాయా, పచ్చల సోమేశ్వరాలయాలు కూడా అభివృద్ధి కానున్నాయి. ఈ మేరకు జి. కిషన్‌రావును మునిసిపల్ కమిషనర్ కేవీ రమణాచారి హైదరాబాద్‌లో ఆయన కార్యాలయంలో కలిసి శిల్పారామానికి సంబంధించిన వివరాలను అందజేశారు.

ప్రజల కోసం పోరాడిన చరిత్ర కమ్యూనిస్టులది

- వారి మద్దతుతో మునుగోడులో టిఆర్ఎస్ గెలుపు
- షాట్–2022 వీధి నాటకోత్సవాల్లో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

వందల ఎకరాల భూములున్నా వదిలేసి.. ప్రజల కోసం నిరంతరం పనిచేసిన చరిత్ర కమ్యూనిస్టు నాయకులదని కవి, గాయకులు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. కమ్యూనిస్టుల మద్దతుతో మునుగోడులో టిఆర్ఎస్ గెలిచిందని చెప్పారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర రెండో మహాసభ సందర్భంగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జి కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న రాష్ట్ర నాలుగో వీధి నాటకోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమాన్ని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజానాట్యమండలి సుదీర్ఘమైన చరిత్ర కలిగి ఉందని చెప్పారు. 1983లో తాను కూడా ప్రజానాట్య మండలిలో పని చేశానని గుర్తు చేసుకున్నారు. "గల్లీ చిన్నది.. గరీబోళ్ల కథ పెద్దది" అన్న పాట పాడగా.. సభ అభిమానులు, కళాకారుల చప్పట్లతో మారుమోగింది. అనంతరం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో గోరటి వెంకన్నను ఘనంగా సన్మానించారు. పిఎన్‌ఎం రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున, ఆవాజ్ రాష్ట్ర నాయకులు సయ్యద్ హషం, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి, కార్మిక సంఘం నాయకులు నారి ఐలయ్య, పాటల రచయిత కాకం ఆంజనేయులు, పిఎన్‌ఎం రాష్ట్ర సహాయ కార్యదర్శులు కల్యాణి, జక్కిడి నర్సింహారెడ్డి, కవి, గాయకులు అంబటి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

వీధి నాటకోత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

కళారూపాలు..

కళారూపాల సమన్వయకర్త, ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి వేముల సదానంద్ ఆధ్వర్యంలో హోరుగాలి, రైతు దేశం, గెలవాలి రేలారేలా.., వీర తెలంగాణ నాటికలు ప్రదర్శించారు. పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ కళారూపాలను తిలకించారు.

ఎన్‌పిఎస్‌పై వ్యతిరేకత చాటిన సిపిఎస్ ఉపాధ్యాయులు

- ట్విట్టర్ అభియాన్‌లో పాత పెన్షన్ ట్రెండింగ్‌లో మొదటి స్థానం

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా ఉన్న నూతన పెన్షన్ విధానంలోనే ఉద్యోగ ఉపాధ్యాయులు నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ హక్కు పాత పెన్షన్ అని తెలిపేటట్టు శనివారం ట్విట్టర్ అభియాన్ అనే కార్యక్రమాన్ని నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. ఆర్టికల్ 309 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ రూల్స్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి సంపూర్ణ అధికారం ఉందనీ, అదే విధంగా ఏడవ షెడ్యూల్ ఆర్టికల్ 246లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్లు రాష్ట్ర జాబితాలోనే ఉన్నాయని స్పష్టం చేశారు. పీఎఫ్ఆర్డీఏ చట్టం ఇందుకు వ్యతిరేకంగా ఉందనీ, రాజ్యాంగం ప్రకారం ఉద్యోగ, ఉపాధ్యాయుల సామాజిక భద్రత ప్రభుత్వాలదేననని తెలిపారు. అయితే పీఎఫ్ఆర్డీఏ చట్టం ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్తు షేర్ మార్కెట్ పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ నిధిని తిరిగిచ్చేందుకు అవకాశం లేదని చెప్పడం విడ్డూరమని అన్నారు. ట్విట్టర్ ట్రెండింగ్‌లో కాన్స్టిట్యూషనల్ డే ఓపిఎస్ మొదటి స్థానంలోనే కొనసాగటం పట్ల మరొకసారి ఉద్యోగ, ఉపాధ్యాయులకు నూతన పెన్షన్ విధానంపై ఉన్న వ్యతిరేకత బహిర్గతమైందన్నారు. ఈ చట్టం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను మినహాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీపీఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్ గౌడ్‌లు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పరేష్‌దోషి

హైదరాబాద్‌కు విస్తరించిన జస్లోక్ హాస్పిటల్

హైదరాబాద్ : ముంబయి కేంద్రంగా పని చేస్తున్న జస్లోక్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ తమ క్లినిక్‌ను హైదరాబాద్‌లో తెరుస్తున్నట్లు ప్రకటించింది. శనివారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జస్లోక్ హాస్పిటల్ ఫంక్షనల్ న్యూరోసర్జరీ ఫౌండర్, డైరెక్టర్ డాక్టర్ పరేష్ దోషి మాట్లాడుతూ.. ఫంక్షనల్ న్యూరో సర్జరీ పరంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ ఫంక్షనల్ న్యూరోసర్జరీ, డిఎ బ్రెయిన్ స్టిమ్యులేషన్‌లో అపారమైన అనుభవం కలిగిన జస్లోక్ హాస్పిటల్ మెరుగైన చికిత్సనందించే రీతిలో కొండాపూర్‌లో తమ క్లినిక్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో జస్లోక్ హాస్పిటల్ సిఇఒ జితేంద్ర హర్యన్, సియా లైఫ్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ స్వాతి ప్రత్తిపాటి, ఫంక్షనల్ న్యూరో సర్జన్ కన్సల్టెంట్ మనీష్ బల్దియా పాల్గొన్నారు. ఈ ఫంక్షనల్ న్యూరాలజీ క్లినిక్ నగరవాసులకు మెరుగైన సేవలను అందించడంతో పాటుగా వారికి తగిన సౌకర్యమూ అందిస్తుందని మనీష్ పేర్కొన్నారు.

ప్రతిభావంతులకు ప్రభుత్వం అండ

- నానో ఉపగ్రహాల విజయవంతంపై సిఎం హర్షం

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

'ధృవ' స్పేస్ టెక్ ప్రైవేటు సంస్థ ద్వారా శనివారం శ్రీహరికోట నుంచి ప్రయోగించిన రెండు నానో ఉపగ్రహాల ప్రయోగం విజయవంతం కావడంపై ముఖ్యమంత్రి కెసిఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రోకు చెందిన పిఎస్ఎల్‌వి–54తోపాటు హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ కంపెనీ 'ధృవ' సంస్థ పంపిన 'తై బోల్ట్ 1, తై బోల్ట్ 2' ఉపగ్రహాలు వాటి కక్ష్యల్లోకి చేరడం దేశ అంకుర సంస్థల చరిత్రలో ఓ శుభ దినమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన టిహబ్‌లో సభ్య సంస్థ 'స్కైరూట్' ఇటీవల ప్రయోగించిన విక్రమ్–ఎస్ ఉపగ్రహ ప్రయోగం విజయవంతం కావడం ద్వారా దేశ ఉప గ్రహ ప్రయోగాల చరిత్రలో తెలంగాణ స్టార్టప్ మొట్ట మొదటి సంస్థగా చరిత్ర లిఖించిందన్నారు. తాజా ప్రయోగాలతో అంకుర సంస్థల నగరంగా పేరొందిన హైదరాబాద్ విశిష్టత మరింత పెరిగిందన్నారు. ఔత్సాహికుల ప్రతిభను వెలికితీయడం, పరిశ్రమలు, శాస్త్ర సాంకేతిక సమాచార రంగాల్లో అవకాశాల సృష్టే లక్ష్యంగా ప్రారంభించిన టీహబ్‌లు భవిష్యత్తులో మరెన్నో మైలురాళ్లు సాధిస్తాయనే నమ్మకం తనకుందని, ఇది ఆరంభం మాత్రమేనని సీఎం అన్నారు. తెలంగాణ కీర్తిని చాటిన 'స్కైరూట్', 'ధృవ' స్పేస్ స్టార్టప్ సంస్థల ప్రతినిధులకు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో తెలంగాణ యువత భారతదేశ అభివృద్ధి కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. తమ ప్రతిభను ప్రపంచానికి చాటుతూ భారత దేశ కీర్తిని ఇనుమడింపచేసే యువతీ యువకులకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు. శాస్త్ర సాంకేతిక, ఐటీ రంగాల్లో ఔత్సాహికులైన యువతీ యువకుల ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్న మంత్రి కేటీఆర్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

బండ చాకి(రీ) రేవు బతుకులు

- బట్టలెన్ని ఉతికినా పూట గడవని వైనం
- మురికి నీళ్లు.. డిటర్జెంట్స్ వల్ల చర్మవ్యాధులు
- లాండ్రీలకు ఉచిత కరెంట్ ఉత్తమాటే..
- వాషింగ్ మిషన్లు, డ్రైక్లీనర్లతో కరువైన పని

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

'మాయితో పుట్టినోణ్ని మల్లెపూవోలే చేసి ముట్టు బట్టలుతికి.. మురికంతా ఎల్లాగడిగి ఎగదుడిసీ.. దిగా దుడిసీ.. దిష్టి పూసాలు కట్టి'

అంటూ ప్రజావాగ్గేయకారులు గోరటి వెంకన్న పాడిన పాట అక్షర సత్యం. రజక వృత్తిదారులు బండచాకిరీ చేసినా పూటగడవని దుస్థితి. పొద్దున్నే చాకిరేవుకెళ్లి మురికి బట్టలు ఉతికి.. ఉతికి అలసిపోతున్నారు. కాళ్లు, నడువు, కీళ్ల నొప్పులతో తిప్పలు పడుతున్నారు. చెరువు, కుంటల్లోని మురికి నీళ్లు.. సబ్బు, సర్ఫ్ వంటి డిటర్జెంట్స్ వల్ల చర్మవ్యాధుల పాలవుతున్నారు. బట్టలెన్ని ఉతికినా.. ఇస్త్రీ ఎంత చేసినా పూటగడవడం కష్టంగా మారింది. మరోవైపు వాషింగ్ మిషన్లు, డ్రైక్లీనర్స్ వంటి యంత్రాలొచ్చాక బట్టలుతికే పని దొరకట్లేదు. చావు, పెళ్లిళ్లకు చాకిరీ చేసినా సరిపడా కూలి డబ్బులివ్వరు. లాండ్రీషాపులకు ఉచిత కరెంట్ పథకం ఉట్టెక్కింది. ఏ ఆసరా లేని తమకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు, పింఛన్లు, స్వయం ఉపాధికి సబ్సిడీ రుణాలివ్వాలని రజక వృత్తిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఉస్సో.. ఉస్సో.. ఉస్సో అంటూ ఊపిరి ఎగబోస్తూ చాకిరేవు బండమీద బట్టలుతికే రజకుల బతుకులపై యాంత్రీకరణ ప్రభావం తీవ్రంగా పడింది. వాషింగ్ మిషన్లు వచ్చాక బట్టలుతికే పని లేకుండా పోయింది. చీరలు, ప్యాంటు, షర్ట్స్, యూనిఫామ్స్ మాత్రమే కాకుండా దుప్పట్లు, బొంతలు, టవల్స్, డోర్‌కటన్స్ వంటివి ఉతికే పని కూడా లేకుండా పోయింది. చావు, పురుడు వంటి మైల బట్టల్ని మాత్రం రజకులతోనే ఉతికిస్తున్నారు. సంగారెడ్డి పట్టణంలో 450 రజక కుటుంబాలుంటే అందులో వంద కుటుంబాలు కూడా కుల వృత్తి చేయట్లేదు. అనేక గ్రామాల్లో రజక వృత్తిదారులున్నారు. బట్టలు ఉతికే పని తగ్గడంతో ఊర్లల్లో కూలి పనులు చేయడం.. లేదంటే పట్టణాలకు వలసెళ్లి నిర్మాణ రంగం, కంపెనీల్లో వాచ్‌మెన్ తదితర పనులు చేస్తున్నారు.

బండ చాకిరీ..

రజకులు మాసిన బట్టల మూటలు తీసుకుని చాకిరేవుకెళ్తారు. పొద్దున 7 గంటలకెళ్లి బట్టల మూటలన్నీ ఉతికే జాడిచ్చే సరికి మధ్యాహ్నం 2 గంటలవుతోంది. బట్టలు ఆరాక ఇంటికి తీసుకొచ్చి ఇస్త్రీ చేయాలి. ఇలా రెండ్రోజులు అదే పనిగా చేస్తే జత బట్టలు ఉతికి ఇస్త్రీ చేస్తే రూ.40 రూపాయలిస్తారు. ఉతికిస్తే జతకు రూ.20 ఇస్తారు. 20 జతల బట్టల్ని ఉతికితే రూ.400 ఆదాయం, ఇస్త్రీ కూడా చేస్తే రూ.800 ఆదాయం వస్తది. అంటే సగటున రోజంతా బండ చాకిరీ చేసినా రూ.400 కూలే దక్కుతుంది. అందులోంచి చాకిరేవుకెళ్లేందుకు లూనా లాంటి మోటార్ సైకిల్ ఉంటే పెట్రోల్, సబ్బులు, సర్ఫ్ ఖర్చులు పోగా రూ.200 మిగలని పరిస్థితి. అడ్డామీద కూలీ పనికెళ్లితే కనీసం రూ.800 ఇస్తారు.

చర్మవ్యాధులు, వెన్నుపూస జబ్బులు

చాకిరేవులో బట్టలుతికే రజకులు రోగాల పాలవుతున్నారు. నీళ్లల్లో నిలబడి, వంగబడి బట్టల్ని ఉతకాలి. బట్టలు జాడించి ఆరేయాలి. ఈ పనులన్నీ వంగి ఉండే చేయాలి. చెరువులు, కుంటల్లో నీళ్లన్నీ మురికి మయమయ్యాయి. నీళ్లల్లో నిలుచుండి బట్టలుతకడం వల్ల కాళ్లకు పగుళ్లు వచ్చి చిట్లుతిన్నాయి. మురికి నీళ్లన్నీ ఒంటిమీద పడటం, డిటర్జెంట్స్ వల్ల చర్మ వ్యాధులు వస్తున్నాయి. శ్వాసకోశ, దద్దుర్లు, దురద, గజ్జి వంటి వ్యాధులు కూడా వస్తున్నాయి.

సంప్రదాయ పనుల పేర వెట్టి

రజక వృత్తిదారులు బట్టలుతకడం, ఇస్త్రీ చేయడమే కాకుండా సంప్రదాయక పనులు కూడా చేస్తున్నారు. గ్రామం, పట్టణాల్లో ఇండ్లను వారు వంతుల వారీగా పంచుకుంటారు. వారి పరిధిలోకి వచ్చే కుటుంబాలకు వారే బట్టలుతకడం, సంప్రదాయ సేవలు అందిస్తారు. ఎవరింట్లో అయినా వ్యక్తి చనిపోతే.. ఆ ఇంటిని చూసే రజక కుటుంబమే వెళ్లి కుండ తేవడం, శవం ఉంచే ప్రాంతంలో గడ్డివేయడం, దీపం పెట్టడం, అంత్యక్రియలయ్యాక ఆ ఇల్లంతా శుభ్రం చేయడం, మైల బట్టల్ని ఉతకడం వంటి పనులు చేస్తారు. ప్రసవం జరిగిన ఇంట్లో కూడా బాలింత, పిల్ల మైల బట్టలుతుకుతారు. ఇన్ని పనులు చేసినా భార్యాభర్తలకు కలిపి రూ.500 చేతిలో పెట్టి పంపుతారు. ఇటువంటి పనులకు ఇచ్చినంత తీసుకోవడం తప్ప డిమాండ్ చేసే పరిస్థితి ఉండదని పలువురు వృత్తిదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

కరెంటోళ్ల కొరడా..

లాండ్రీషాపు, దోబీఘాట్స్, డ్రైక్లీనర్స్ నడిపే రజకులకు 250 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ సరఫరా చేస్తున్నారు. క్షౌరవృత్తిదారుల సెలూన్లు, రజకుల లాండ్రీ దుకాణాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్న ప్రభుత్వం బకాయిలను చెల్లించడంలో శ్రద్ధ చూపట్లేదు. ఫలితంగా కరెంట్ డిపార్ట్‌మెంట్ నుంచి మీటర్లను తనిఖీ చేసి బిల్లులను బలవంతంగా వసూలు చేస్తున్నారు. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని అనేక గ్రామాలు, మండల, పట్టణ కేంద్రాల్లో ఇప్పటికే కరెంట్ బిల్లులు కట్టించుకున్నారు. ఇదేమిటని అడిగితే ప్రభుత్వం నుంచి బకాయిలు రావట్లేదని, బిల్లు కట్టకపోతే కనెక్షన్ కట్‌చేస్తామని చెబుతున్నారు. సంగారెడ్డి పట్టణంలో రజక వృత్తిదారుడు హెచ్.రాజు ఇస్త్రీ షాప్‌కు రూ.460 కరెంట్ బిల్లులు వస్తే కట్టే వరకు ఒత్తిడి చేశారు. కనెక్షన్ కట్ చేస్తే ఇస్త్రీ పని ఆగిపోవడం, మళ్లీ కనెక్షన్ ఇవ్వాలంటే అదనంగా డబ్బులు చెల్లించాల్సి వస్తుందనే భయంతో బిల్లులు కడుతున్నట్టు పలువురు వృత్తిదారులు చెబుతున్నారు.

చాకిరీ చేస్తం
హెచ్.రాజు- సంగారెడ్డి

ముప్పై ఏండ్ల నుంచి బట్టలుతుకుతున్న. నేను నాభార్య ఇద్దరమిదే పనిచేస్తం. ఒకప్పుడు వందలాది ఇండ్ల బట్టలుతికేది. ఇప్పుడు మిషన్లు వచ్చాక ఓ ఐదారు ఇండ్ల బట్టలే ఉతుకుతం. పొద్దున చాకిరేవుకు పోతే సాయంత్రం ఇంటికొస్తం. మరుసటి రోజంతా ఇస్త్రీ చేసి ఇస్తే జతకు రూ.30–40 వరకే ఇస్తరు. నా వంతుకొచ్చిన ఇండ్లల్లో చావైనా పెళ్లైనా పురుడొచ్చినా మేమెళ్లి పనులు చేస్తం. వాళ్లిచ్చినంత తీసుకోవాలి. ఇస్త్రీ డబ్బాకు రూ.450 బిల్లు కట్టించుకుండ్రు. కట్టకపోతే విద్యుత్ కనెక్షన్ కట్‌చేస్తమన్నరు. ప్రభుత్వం ఉచితమంటది. కరెంటోళ్లొచ్చి బిల్లు వసూలు చేస్తుండ్రు. మాకిద్దరు ఆడపిల్లలు. నా భార్య అనారోగ్యం పాలైంది. బట్టలుతికితే తప్ప పూట గడవట్లేదు. ప్రభుత్వం మాకు డబుల్‌బెడ్‌రూం ఇల్లు, పింఛన్లు ఇవ్వాలి.

రజకులపై సామాజిక వివక్ష
హనుమంతు- రజకవృత్తిదారుల సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు

రజకులపై సామాజిక వివక్ష కొనసాగుతోంది. ఇప్పటికీ రేట్లు పెంచమని అడిగితే గ్రామ బహిష్కరణ చేస్తుండ్రు. దాడులు చేస్తుండ్రు. కులం పేరుతో పిలిచి అవమానిస్తుండ్రు. వేలాది కుటుంబాలకు వృత్తి పనిలేకుండా పోయింది. కంపెనీలు, ఆస్పత్రులు, విద్యా సంస్థల్లో వాచ్‌మెన్, ఇతర పనులు చేస్తూ బతుకుతున్నరు. ప్రభుత్వం ఉచిత విద్యుత్ బకాయిలు చెల్లించాలి. వృత్తిదారులకు కరెంట్ కట్ చేయకుండా, బిల్లులు అడగకుండా విద్యుత్ అధికారులకు ఆదేశాలివ్వాలి. డబుల్ బెడ్ రూం ఇండ్లు, 50 ఏండ్ల వారికి పింఛన్లు, వంద శాతం సబ్సిడీ రుణాలు, రజక బంధు వంటి పథకాల్ని అమలు చేయాలి.

పాఠశాల భద్రతను విస్తృత కోణంలో చూడాలి

- మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

పాఠశాల భద్రత అంటే కేవలం సదుపాయాలు, భౌతిక భద్రతకు మాత్రమే పరిమితమై చూడకుండా విస్తృత కోణం నుంచి చూడాల్సిన అవసరం ఉందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. పిల్లలు గౌరవంగా జీవించే, సురక్షితమైన వాతావరణంలో విద్యను పొందే అవకాశాలను కల్పించాలని సూచించారు. విద్యార్థుల రక్షణ, భద్రత కోసం చేపట్టాల్సిన చర్యలపై ఏర్పాటు చేసిన కమిటీ సమావేశాన్ని శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పిల్లలు ఎక్కువ సమయాన్ని పాఠశాలల్లోనే గడుపుతున్నందున పరిసరాలతో సహా పాఠశాలను సౌకర్యవంతమైన వాతావరణంతోపాటు సురక్షితమైనదిగా, రక్షణాత్మకమైనదిగా తీర్చిదిద్దాల్సిన అవసరముందని అన్నారు. పాఠశాలలను సురక్షితంగా ఉంచడం వల్ల పిల్లల సామాజిక, సృజనాత్మకమైన అభ్యాసాన్ని పెంపొందించే వీలు కలుగుతుందని మంత్రి తెలిపారు. విద్యార్థుల్లో అభద్రతాభావం నెలకొంటే విద్యపై సరైన దృష్టి సారించలేకపోవడం వల్ల వారు నష్టపోయే అవకాశం కలుగుతుందన్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో పలు భద్రతా జాగ్రత్తలు తీసుకుంటున్నా మరింత భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, విద్యార్థుల భవిష్యత్తు విషయంలోనూ మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల భద్రతకు సంబంధించి పలు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఇప్పటికే కొన్ని మార్గదర్శకాలను సూచించిందనీ, వీటిని తప్పనిసరిగా పాటించేలా చూడడంతో పాటు ప్రస్తుత పరిస్థితుల కనుగుణంగా ఎలాంటి చర్యలు చేపడితే బాగుంటుందో ప్రభుత్వానికి సూచన చేయాలని కమిటీ సభ్యులను కోరారు. ఈ కమిటీ సభ్యులందరూ రాష్ట్రంలోని పాఠశాలల్లో సుహృద్భావ వాతావరణం నెలకొనే విధంగా విద్యార్థులు తల్లిదండ్రులతోనూ, మేధావులతోనూ, విద్యారంగ నిపుణులతో చర్చించి తగిన సలహాలు సూచనలు ప్రభుత్వానికి అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో డీజీపి మహేందర్ రెడ్డి, అదనపు డీజీపీ స్వాతిలక్రా, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి దివ్య, డి ఐ జి సుమతి తదితరులు పాల్గొన్నారు.

యాంకర్ అనసూయ ఫిర్యాదు

- నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి–హైదరాబాద్ బ్యూరో

సినీనటులు, యాంకర్ల ఫొటోలు మార్ఫింగ్ చేసి అసభ్యకర పదజాలంతో సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్న వ్యక్తిని సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని ఏపీలోని కోనసీమ జిల్లా పాసలపూడి గ్రామానికి చెందినవాడిగా గుర్తించారు. అతడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుడి తీరుపై ఈ నెల 17న సైబర్ క్రైం పోలీసులకు యాంకర్ అనసూయ ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నకిలీ ట్విటర్ ఖాతా నుంచి 267 హీరోయిన్ల ఫొటోలను మార్ఫింగ్ చేసి పోస్టు చేసినట్లు గుర్తించి నిందితుడిని అరెస్టు చేశారు.